సిమెంట్ ఫ్యాక్టరీ తెరిపించాలి

ఆందోళన చేస్తున్న సీపీఎం నాయకులు

ఆదిలాబాద్‌లోని సీసీఐ సిమెంట్ ఫ్యాక్టరీని పునరుద్ధరించాలని సీపీఎం రాష్ట్ర నాయకుడు బండారి రవికుమార్ డిమాండ్ చేశారు. సీసీఐ ఫ్యాక్టరీ పునరుద్ధరించాలని డిమాండ్ చేస్తూ బుధవారం పట్టణంలోని సుందరయ్య భవనం ఎదుట రహదారిపై ఆందోళన చేపట్టారు. గత ఎన్నికల్లో బీజేపీ ప్రజలకు ఇచ్చిన హామీని నెరవేర్చాలన్నారు. సిమెంట్ ఫ్యాక్టరీ లోక్‌సభ ఎన్నికల లోపు తెరిపించాలని లేకుంటే బీజేపీ ఓట్లు అడగవద్దని అన్నారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు పాల్గొన్నారు.

– ఆదిలాబాద్ రూరల్, జనవరి 10

రైల్వే ఉద్యోగుల నిరాహార దీక్ష

నూతన పింఛన్ విధానాన్ని తొలగించి పాత పింఛన్ విధానాన్ని అమలు చేయాలని దక్షిణ మధ్య రైల్వే ఉద్యోగుల సంఘం ఆదిలాబాద్ శాఖ ఆధ్వర్యంలో ఉద్యోగులు పట్టణంలోని రైల్వే స్టేషన్ ఆవరణలో బుధవారం ఒక రోజు నిరాహార దీక్ష చేపట్టారు. కొత్త పింఛన్ విధానం వల్ల తాము నష్టపోతున్నామని, పాత విధానాన్ని యథావిధిగా కొనసాగించాలని నినాదాలు చేశారు. ఈ విషయంలో కేంద్ర ప్రభుత్వం స్పందించనిచో ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో రైల్వే ఉద్యోగులు పాల్గొన్నారు.

– ఆదిలాబాద్ రూరల్, జనవరి 10

నిరాహార దీక్ష చేస్తున్న రైల్వే ఉద్యోగులు

మొక్కల సంరక్షణ ఇదేనా..?

మాన్కాపూర్ ప్రధాన రహదారికి ఇరువైపులా పిచ్చిమొక్కల మధ్య పెరుగుతున్న మొక్క

నేలకొరిగిన మొక్క, ట్రీగార్డు

నార్నూర్, గాదిగూడ మండలంలోని 48 గ్రామ పంచాయతీల్లో హరితహారంలో వేల సంఖ్యలో మొక్కలు నాటారు. ఉన్నతాధికారుల పర్యవేక్షణ లోపంతో చాలా మొక్కలు ఎండిపోవడం, పశువులు తినడం, పిచ్చిమొక్కల మధ్య దర్శనమిస్తున్నాయి. పంచాయతీ పరిధిలో నాటిన మొక్కల్లో కనీసం 50శాతం కనిపించడం లేదు. ఇప్పటికైన ఉన్నతాధికారులు స్పందించి మొక్కల సంరక్షణ చర్యలు చేపట్టాలని ప్రకృతి ప్రేమికులు కోరుతున్నారు.

-నార్నూర్, జనవరి 10

విద్యుత్ షార్ట్‌సర్క్యూట్

ఎదులాపురం, జనవరి 10 : జిల్లా కేంద్రంలోని టీచర్ కాలనీలో నివాసం ఉంటున్న రాజేశ్వర్ రెడ్డి ఇంట్లో బుధవారం ఉదయం విద్యుత్ మీటర్ల నుంచి మంటలు చెలరేగాయి. దీంతో అప్రమత్తమై మంటలు ఆర్పేందుకు ప్రయత్నం చేశారు. స్థానికులు వెంటనే అగ్నిమాపక శాఖ అధికారులకు సమాచారం అందించారు. కాగా అగ్నిమాపక వాహనం వచ్చే లోపు మంటలను స్థానికులు ఆర్పివేశారు. విద్యుత్ షార్ట్‌సర్క్యూట్‌తో ఆరు మీటర్లు కాలిపోగా, ఎలాంటి ప్రాణ, ఆస్తినష్టం జరగలేదు. అయినప్పటికీ అగ్నిమాపక, విద్యుత్ శాఖ అధికారులు వివరాలు నమోదు చేసుకున్నారు.

నేడు హ్యాండ్ బాల్ ఎంపిక పోటీలు

ఎదులాపురం, జనవరి 10 : ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా హ్యాండ్ బాల్ సంఘం ఆధ్వర్యంలో హ్యాండ్ బాల్ జూనియర్ బాలికల జట్లను ఎంపిక చేయనున్నట్లు జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు శ్యాంసుందర్ రావు, కనపర్తి రమేశ్ ఒక ప్రకటనలో తెలిపారు. గురువారం కుమ్రం భీం ఆసిపాబాద్ జిల్లాలో జూనియర్ బాలికల జట్లను ఎంపిక చేయనున్నట్లు పేర్కొన్నారు. ఆసక్తి గల క్రీడాకారులు ఉదయం 10 గంటలకు ఆసిఫాబాద్‌లోని ట్రైబల్ వెల్ఫేర్ మోడల్ బాలికల పాఠశాలలో రిపోర్ట్ చేయాలన్నారు. పోటీల్లో పాల్గొనే క్రీడాకారులు ఆధార్ కార్డు, పదో తరగతి మెమో బోనఫైడ్ సర్టిఫికెట్లు తీసుకురావాలన్నారు. ఇక్కడ ఎంపికైన క్రీడాకారులు ఆసిఫాబాద్‌లో నిర్వహించే రాష్ట్ర స్థాయి జూనియర్ బాలికల పోటీలో పాల్గొంటారని తెలిపారు.

సేవాలాల్ జయంతి రోజున సెలవు ప్రకటించాలి

బోథ్, జనవరి 10 : బంజారాల ఆరాధ్య దైవం శ్రీ సంత్ సేవాలాల్ మహారాజ్ జయంతి రోజు ఫిబ్రవరి 15న సెలవు దినంగా ప్రకటించేలా ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని బోథ్ తాలూకా గోర్ సేనా కమిటీ సభ్యులు బుధవారం నేరడిగొండలో ఎమ్మెల్యే అనిల్ జాదవ్‌ను కలిసి వినతిపత్రం ఇచ్చారు. ఇక్కడ కమిటీ సభ్యులు, కార్యకర్తలు ఉన్నారు.

అందరి సహకారంతోనే బాలల సంక్షేమం సాధ్యం

- ఐసీపీఎస్ ప్రోగ్రాం మేనేజర్ డేవిడ్

మాట్లాడుతున్న ఐసీపీఎస్ ప్రోగ్రాం మేనేజర్ డేవిడ్

ఎదులాపురం, జనవరి 10 : అన్ని శాఖల అధికారుల సమన్వయంతోనే జిల్లా బాలల సంక్షేమం సాధ్యమవుతుందని హైదరాబాద్ నుంచి వచ్చిన ఐసీపీఎస్ ప్రోగ్రాం మేనేజర్ డేవిడ్ అన్నారు. బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో మహిత ఆర్గనైజేషన్, జిల్లా సంక్షేమ అధికారి, మహిళా శిశు సంరక్షణ శాఖ ఆధ్వర్యంలో జిల్లా బాలల రక్షణ ప్రణాళిక ఏర్పాటు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాలల ప్రమాదకర ప్రదేశాలు, అంశాలు గుర్తించి తీసుకోవాల్సిన చర్యలను వివరించారు. పరస్పర సహకారంతోనే బాలల సంక్షేమం, అభివృద్ధి సాధ్యమవుతుందని పేర్కొన్నారు. పిల్లల కోసం ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలు, అవకాశాలు సద్వినియోగం చేసుకునేలా కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి మిల్కా, సీడబ్ల్యూసీ చైర్మన్ వెంకటస్వామి, ఐటీడీఏ డీడీ దిలీప్‌కుమార్, మైనార్టీ సంక్షేమ అధికారి రాథోడ్ రమేశ్, డీసీపీవో రాజేంద్రప్రసాద్, సీడబ్ల్యూసీ సభ్యులు సమీర్ ఉల్లాఖాన్, డేవిడ్, దశరథ్, రెవెన్యూ శాఖ అధికారి రాజేశ్వర్, ఎక్సైజ్ ఎస్ఐ సంజీవ్, సీడీపీవోలు, సూపర్‌వైజర్లు, మహిత ఆర్గనైజేషన్ ప్రోగ్రాం మేనేజర్ శ్రీకాంత్, మహిళా సాధికారత కోఆర్డినేటర్ యశోద, సఖీ కేంద్రం నిర్వాహకురాలు సరస్వతి, చైల్డ్‌లైన్ కో ఆర్డినేటర్ సతీశ్, తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులే లక్ష్యం

- బోథ్ ఎమ్మెల్యే జాదవ్ అనిల్



బజార్‌హత్నూర్: పంచాయతీ భవనాన్ని ప్రారంభిస్తున్న బోథ్ ఎమ్మెల్యే, మాజీ ఎంపీ

బజార్‌హత్నూర్, జనవరి 10: అభివృద్ధి పనులే బీఆర్ఎస్ పార్టీ లక్ష్యమని బోథ్ ఎమ్మెల్యే జాదవ్ అనిల్ అన్నారు. బుధవారం మండలంలోని గులాబ్‌తండా, ఎస్సాపూర్, బజార్‌హత్నూర్ గ్రామాల్లో పలు అభివృద్ధి పనులను మాజీ ఎంపీ నగేశ్‌తో కలిసి ప్రారంభించారు. ఎస్సాపూర్‌లో రూ.కోటితో చేపడుతున్న రోడ్డు నిర్మాణానికి భూమి పూజ చేసి పనులను ప్రారంభించారు. గులాబ్‌తండా గ్రామంలో రూ.20 లక్షలతో నిర్మించిన పంచాయతీ భవనాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐటీడీఏ నిధులతో రోడ్లు నిర్మిస్తున్నామన్నారు. సదరు కాంట్రాక్టర్‌కు పలు సలహాలు సూచనలు ఇచ్చారు. నాణ్యత ప్రమాణాలు పాటిస్తూ త్వరగా పనులు పూర్తి చేయాలని సూచించారు. త్వరలోనే మోర్కండి నుంచి బరంపూర్ మీదుగా ఆదిలాబాద్ వెళ్లే రహదారి మంజూరు అయ్యే విధంగా చూస్తామని పేర్కొన్నారు. అనంతరం బజార్‌హత్నూర్‌లోని ప్రభుత్వ పాఠశాలలో కంప్యూటర్ గదిని ప్రారంభించారు. కార్యక్రమంలో జడ్పీటీసీ నర్సయ్య, ఎంపీడీవో రాధ, బీఆర్ఎస్ నాయకులు, ఆయా గ్రామాల సర్పంచ్‌లు పాల్గొన్నారు.

విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలి

బోథ్, జనవరి 10: విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని బోథ్ ఎమ్మెల్యే జాదవ్ అనిల్ సూచించారు. పొచ్చెర క్రాస్‌రోడ్డులోని సెంట్ థామస్ ఉన్నత పాఠశాలలో స్పోర్ట్స్ మీట్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాల స్థాయిలో రాణించిన విద్యార్థులు ముమ్ముందు మండల, జిల్లా, రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొనే అవకాశం కలుగుతుందన్నారు. కార్యక్రమంలో జడ్పీటీసీ సంధ్యారాణి, సర్పంచ్ మల్లేశ్, బీఆర్ఎస్ మండల కన్వీనర్ నారాయణరెడ్డి, ఏఎంసీ చైర్మన్ రుక్మాణ్‌సింగ్, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

శనగలో సస్యరక్షణ చర్యలు చేపట్టాలి

శనగ పంటను పరిశీలిస్తున్న అధికారి పుల్లయ్య

నేరడిగొండ, జనవరి 10 : యాసంగిలో పండిస్తున్న శనగపంటలో సస్యరక్షణ చర్యలు చేపట్టాలని జిల్లా వ్యవసాయాధికారి పుల్లయ్య సూచించారు. బుధవారం సావర్గాం గ్రామంలో రైతులు సాగు చేస్తున్న శనగ పంటను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యాసంగిలో ఎక్కువ విస్తీర్ణంలో శనగ పంట సాగవుతున్నట్లు పేర్కొన్నారు. శనగ పంటలో కొన్ని ప్రాంతాల్లో పచ్చ పురుగు, లద్దె పురుగు సోకిందన్నారు. వాటి నివారణకు నోవాల్యురాన్ లేదా ఇమామెక్టిన్ బెంజోయేట్ పురుగు మందును పిచికారీ చేయాలని సూచించారు. రైతులు వ్యవసాయాధికారుల సూచనలు పాటించాలన్నారు. కార్యక్రమంలో ఏవో భాస్కర్, ఏఈవో జైపాల్, రైతులు పాల్గొన్నారు.

మెరుగైన వైద్యం అందించాలి

- వైద్యారోగ్య శాఖ కమిషనర్ ఆర్‌వీ కర్ణన్

మాట్లాడుతున్న కమిషనర్ ఆర్‌వీ కర్ణన్

ఉట్నూర్, జనవరి 10: గిరిజనులకు మెరుగైన వైద్యసేవలు అందించాలని రాష్ట్ర వైద్యారోగ్య శాఖ కమిషనర్ ఆర్‌వీ కర్ణన్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని కుమ్రం భీం ప్రాంగణంలోని సమావేశ మందిరంలో కలెక్టర్ రాహుల్ రాజ్, ఐటీడీఏ పీవో చాహత్ బాజ్‌పాయ్‌తో కలిసి ఆదిలాబాద్, కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా వైద్యాధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ దవాఖానల్లో మెరుగైన వైద్యసేవలు అందించాలన్నారు. మారుమూల గిరిజన ప్రాంతాల ప్రజలకు నిరంతరం వైద్యం అందేలా చూడాలన్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో సాధారణ ప్రసవాల సంఖ్యను పెంచాలని సూచించారు. దవాఖానలో అవసరమైన వైద్యులు, సిబ్బందిని నియమించాలని సూచించారు. అవసరమైన సామగ్రిని సమకూర్చుకోవాలన్నారు. ప్రధానమంత్రి జన్‌జాతి ఆదివాసీ న్యాయ మహా అభిమాన్ కార్యక్రమంలో భాగంగా ప్రతి పీవీటీజీ కుటుంబాలకు ఆరోగ్యశ్రీ, ఆయుష్మాన్ భారత్ పథకాలు అమలు చేయాలన్నారు. గ్రామాల్లో ప్రత్యేక వైద్యశిబిరాలు ఏర్పాటు చేసి వివిధ రకాల పరీక్షలు నిర్వహించాలన్నారు. అనంతరం మొక్కను నాటారు. అనంతరం కలెక్టర్ ఉట్నూర్ ఎంపీడీవో కార్యాలయాన్ని సందర్శించారు. ప్రజాపాలన దరఖాస్తు ఆన్‌లైన్ నమోదు కార్యక్రమాన్ని పరిశీలించారు. ఎలాంటి తప్పులు లేకుండా దరఖాస్తుల వివరాలు నమోదు చేయాలని సూచించారు. కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఖుష్బూగుప్తా, శిక్షణ సహాయ కలెక్టర్ వికాస్ మోహతో, ఆదిలాబాద్, కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లాల వైద్యాధికారులు, అధికారులు, వైద్యులు, పీహెచ్‌వో సందీప్, ఎంపీడీవో తిరుమల పాల్గొన్నారు.

విద్యార్థులకు ప్రవేశ పరీక్ష మెటీరియల్ అందజేత

బోథ్, జనవరి 10 : సొనాలలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలోని నాలుగో తరగతి విద్యార్థులకు బుధవారం పూలే వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో గురుకులాల ప్రవేశ పరీక్షల కోసం అవసరమైన మెటీరియల్ బుక్‌లెట్లను అందజేశారు. కార్యక్రమంలో సొసైటీ చైర్మన్ గాజుల పోతన్న, ప్రధాన కార్యదర్శి బత్తుల రమేశ్, తుమ్మ శ్రీధర్, సాయికృష్ణ, అమృత్‌రావు పాటిల్, అనిల్, పోతన్న, రమేశ్, విజయ్‌భాస్కర్ రెడ్డి, భగత్ ప్రవీణ్, దినేశ్, హరీశ్, ప్రవీణ్, అనిల్, రాజశేఖర్, ప్రశాంత్, ప్రణీత్, ప్రకాశ్ పాల్గొన్నారు.

12న బోథ్‌లో 2కే రన్

బోథ్, జనవరి 10 : వివేకానంద జయంతి పురస్కరించుకొని బోథ్‌లో మాసం లక్ష్మి వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో శుక్రవారం 2కే రన్ నిర్వహించనున్నట్లు చైర్మన్ అనిల్‌కుమార్ తెలిపారు. బోథ్ బస్టాండ్ నుంచి శ్రీ ప్రసన్న వేంకటేశ్వర స్వామి ఆలయం వరకు 2కే రన్ ఉంటుందని పేర్కొన్నారు. వివరాలకు కార్యాలయంలో సంప్రదించాలని కోరారు.

కు.ని శిబిరం

బోథ్, జనవరి 10 : బోథ్‌లోని సామాజిక ఆరోగ్య కేంద్రంలో బుధవారం కుటుంబ నియంత్ర శస్త్రచికిత్స శిబిరం నిర్వహించారు. సూపరింటెండెంట్ డాక్టర్ రవీంద్ర ప్రసాద్ ఆధ్వర్యంలో డాక్టర్ చైతన్య, డాక్టర్ శైలజ వివిధ మండలాల పరిధిలోని గ్రామాలకు చెందిన 15 మంది మహిళలు ట్యూబెక్టమీ ఆపరేషన్లు చేశారు.

ముగిసిన గ్రాంట్ టెస్ట్-2

ఇచ్చోడ, జనవరి 10: మేడిగూడ గిరిజన ఆశ్రమోన్నత బాలికల పాఠశాలతో పాటు మండల కేంద్రంలోని గిరిజన ఆశ్రమ పాఠశాల, సిరికొండ మండలంలోని రాయిగూడ, రిమ్మ గిరిజన ఆశ్రమ పాఠశాలల్లో మూడు రోజుల నుంచి నిర్వహిస్తున్న గ్రాంట్ టెస్ట్-2 బుధవారం ముగిసిందని ప్రత్యేకాధికారి విజయ్ ప్రకాశ్ తెలిపారు. ఐటీడీఏ పీవో చాహత్ బాజ్‌పాయ్ ఆదేశాల మేరకు పదోతరగతి విద్యార్థుల నైపుణ్యాన్ని తెలుసుకోవడానికి ఈ పరీక్ష నిర్వహించామని పేర్కొన్నారు.

సికిల్‌సెల్ పరీక్షలు

భీంపూర్, జనవరి 10: లింగూడ, అర్లి(టీ), శాంతినగర్, వడూర్ గ్రామాల్లో వైద్యులు 200 మంది కొలాం గిరిజన పిల్లలకు గురువారం సికిల్‌సెల్ వైద్య పరీక్షలు చేశారు. కార్యక్రమంలో వైద్యాధికారి నిఖిల్‌రాజ్, హెచ్ ఈవో లింగంపల్లి జ్ఞానేశ్వర్, సూపర్‌వైజర్ గంగాధర్, సిబ్బంది పాల్గొన్నారు.

అయ్యప్ప, శివాలయాన్ని దర్శించుకున్న కలెక్టర్ దంపతులు

అయ్యప్ప స్వామి ఆలయంలో పూజలు చేస్తున్న కలెక్టర్ రాహుల్ రాజ్ దంపతులు

ఆదిలాబాద్ రూరల్, జనవరి 10 : జిల్లా కేంద్రంలోని రవీంద్రనగర్‌లోని అయ్యప్ప, శివాలయాన్ని బుధవారం కలెక్టర్ రాహుల్ రాజ్ దంపతులు దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ కమిటీ సభ్యులు కలెక్టర్ దంపతులను శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో ఆలయ పూజారి దామోదర్ గురుస్వామి, వేణురెడ్డి, అశోక్ పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు బయల్దేరిన జిల్లా కబడ్డీ జట్టు

క్రీడా దుస్తులు అందజేస్తున్న డాక్టర్ రాథోడ్ నరేందర్

ఆదిలాబాద్ రూరల్, జనవరి 10 : సిద్దిపేట జిల్లా గజ్వేల్‌లో జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు ఆదిలాబాద్ జిల్లా జూనియర్స్ బాల, బాలికల కబడ్డీ జట్టు బుధవారం బయలుదేరింది. ఈ నెల 11 నుంచి 14వ తేదీ వరకు జరిగే ఈ పోటీల్లో పాల్గొనే ఆదిలాబాద్ జిల్లా జట్టును రిమ్స్ డైరెక్టర్ రాథోడ్ జైసింగ్, జిల్లా వైద్యారోగ్య శాఖాధికారి రాథోడ్ నరేందర్‌తో పాటు దివ్యశ్రీ ఫౌండేషన్ చైర్మన్ ప్రవీణ్ నాయక్ బస్టాండ్ వద్ద కలిసి సాగనంపారు. ఈ సందర్భంగా డాక్టర్ రాథోడ్ నరేందర్ మాట్లాడుతూ కబడ్డీ క్రీడల్లో ఆదిలాబాద్ జిల్లాకు ప్రత్యేక గుర్తింపు తీసుకురావాలని సూచించారు. విద్యార్థులకు కావాల్సిన క్రీడా దుస్తులు అందజేశారు. వ్యాయామ ఉపాధ్యాయులు, జిల్లా సెక్రటరీ రాష్ట్రపాల్, ఉపాధ్యక్షుడు విఠల్ రెడ్డి, జాయింట్ సెక్రటరీలు అఖిల్, గిరిధర్, సాయి పాల్గొన్నారు.

కపిల్‌తో దీక్ష విరమింపజేసిన ఎమ్మెల్యే



యువరైతు కపిల్‌తో దీక్ష విరమింప చేస్తున్న ఎమ్మెల్యే జాదవ్ అనిల్

భీంపూర్, జనవరి 10 : బోథ్ ఎమ్మెల్యేగా జాదవ్ అనిల్ గెలుపొందే వరకు పాదరక్షలు ధరించనని రెండు నెలల క్రితం భీంపూర్ మండలం అంతర్గాం సర్పంచ్ లలిత కుమారుడు, యువ రైతు, బీఆర్ఎస్ నాయకుడు బక్కి కపిల్‌యాదవ్ ప్రతిజ్ఞ చేసి దీక్ష చేపట్టాడు. ఆయన బీఆర్ఎస్ ప్రచారంలో పాదరక్షలు లేకుండానే తిరిగాడు. గురువారం భీంపూర్‌కు వచ్చిన ఎమ్మెల్యే జాదవ్ అనిల్ హైదరాబాద్ నుంచి ప్రత్యేకంగా తెప్పించిన పాదరక్షలు కపిల్‌కు ఇచ్చి దీక్ష విరమింపజేయించాడు. కపిల్‌ను అభినందించారు.

దీర్ఘకాలిక వ్యాధుల నివారణకు చర్యలు

నార్నూర్,జనవరి10 : దీర్ఘకాలిక వ్యాధుల నివారణకు చర్యలు తీసుకుంటున్నామని హెచ్ఈవో పవార్ రవీందర్ అన్నారు. బుధవారం గాదిగూడ మండలం పర్సువాడ(బీ) గ్రామంలో వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ప్రజల నుంచి రక్తనమూనాలు సేకరించారు. అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు. వ్యాధి లక్షణాల నిర్ధారణ అనంతరం బాధితులకు మెరుగైన వైద్యం అందిస్తామన్నారు. కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పీ ప్రతిమ, హెచ్ఏ సురేశ్, ఏఎన్ఎం గీత, కవిత పాల్గొన్నారు.

మహిళా కానిస్టేబుల్‌కు సన్మానం



భగత్ దీపికను సన్మానిస్తున్న సొసైటీ సభ్యులు

బోథ్, జనవరి 10: సొనాల గ్రామానికి చెందిన ఇటీవల మహిళా పోలీసు కానిస్టేబుల్‌గా ఎంపికైన భగత్ దీపికను పూలే వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో సన్మానించారు. స్థానిక పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో సొసైటీ చైర్మన్ గాజుల పోతన్న, సభ్యులు, ఉపాధ్యాయులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

నేటి నుంచి జై జంగో జై లింగో దీక్షలు

ఉట్నూర్ రూరల్, జనవరి 10 : నేటి నుంచి జై జంగో జై లింగో దీక్షలు చేపట్టడం జరుగుతుందని రాజ్‌గోండ్ సేవా సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మంగం విషంరావ్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. జైనూర్ మండలం జంగాం గ్రామంలోని దీక్ష భూమి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. ఈ పూజలు దీక్ష గురువు ఆత్రం కిసాన్‌రావ్ నిర్వహిస్తారని పేర్కొన్నారు. తెలంగాణ, మహారాష్ట్ర నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు వస్తున్నందున జంగో లింగో ఘన్ సంస్థాన్ పీఠాధిపతి భగవంత్‌రావ్ పటేల్, అధ్యక్షుడు ఆత్రం రఘునాథ్ ఆధ్వర్యంలో భక్తుల కోసం సౌకర్యాలు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు.

14న స్మారక క్రికెట్ టోర్నమెంట్ పోటీలు

నార్నూర్,జనవరి 10 : బాబేఝరి గ్రామ పంచాయతీ పరిధిలోని మంజ్రిలో ఈ నెల 14వ తేదీన పేందోర్ రామారావుపటేల్ స్మారక క్రికెట్ టోర్నమెంట్ పోటీలు నిర్వహించన్నుట్లు సర్పంచ్ మడావి కైలేశ్వరీసాగర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల క్రీడాకారులు ఎంట్రీ ఫీజు రూ.601 చెల్లించాలని పేర్కొన్నారు.

ఘనంగా విశ్వహిందీ దివస్ వేడుకలు

విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న ఉపాధ్యాయులు

తాంసి(తలమడుగు), జనవరి 10: తలమడుగు మండలంలోని ఖోడద్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం విశ్వ హిందీ దివస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయుడు కృష్ణకుమారి మాట్లాడుతూ జాతీయ భాష హిందీని ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా నేర్చుకోవాలని కోరారు. విద్యార్థులకు వ్యాసరచన, ఉపన్యాస పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. అనంతరం హిందీ భాషా సేవా సమితి జిల్లా అధ్యక్షుడు సుకుమార్ పెట్కులేను పాఠశాల సిబ్బంది సన్మానించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు సుకుమార్ పెట్కులే, వాసుదేవ్, సురేఖ, సురేఖ రెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.

వివేకానంద జయంతిని విజయవంతం చేయాలి

మాట్లాడుతున్న యువజన సంఘాల సమితి జిల్లా అధ్యక్షుడు

ఆదిలాబాద్ రూరల్, జనవరి 10: యువతకు స్ఫూర్తి ప్రదాత స్వామి వివేకానంద జయంతి ఈ నెల 12వ తేదీన నిర్వహిస్తున్న సందర్భంగా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని యువజన సంఘాల సమితి జిల్లా అధ్యక్షుడు బాలశంకర్ కృష్ణ, పట్టణాధ్యక్షుడు గణేశ్ పిలుపునిచ్చారు. బుధవారం జిల్లా కేంద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో సమితి సభ్యులతో కలిసి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ఈ కార్యక్రమానికి అతిథులుగా పురప్రముఖులు, రాజకీయ నాయకులు, అన్ని వర్గాల ప్రజలు పాల్గొనాలని కోరారు. సమావేశంలో సమితి సభ్యులు పాల్గొన్నారు.

నమస్తే తెలంగాణ CLASSIFIED

CHANGE OF NAME

By This deed I, the under singned **HAJIYANI SHERALI KAJIMOHAMED S/o.HAJIYANI KAJIMOHAMED ALIRAJALI,** Mother name **HAJIYANI RUKSHANABEN KAJIMOHAMED** R/o. H.No.5-6-97/Z-7, Kachi colony, Mdl:Nirmal Urban, Dist. Nirmal, T.S. have changed my name to **SHERALI HAJIYANI S/o.KAJIMOHD HAJIYANI** Mother Name **HAJIYANI RUKSHANABEN** for all future purpose.

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధము లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

Classified Ads
మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం.. మన
నమస్తే తెలంగాణ
క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం
4 లైన్ల ప్రకటన కేవలం 200/- మాత్రమే
ప్రతి ఎక్స్‌ట్రా లైన్‌కి 50/- మాత్రమే
3+1 స్కీం కలదు
ప్రకటనల విభాగం...
GST 5% వర్తించును
మంచిర్యాల: 91827 77676, ఆసిఫాబాద్: 91827 77679
నిర్మల్: 91827 77671, 91827 77677